# జనపదం
JANAPADHAM

హైదరాబాద్ | శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 95

తెలుగు దినపత్రిక




## ఎమ్మెల్యేలేనా..? లేకా...?

### వీధి రౌడీల్లా వ్యవహారం..

**బతుకు దెరువు... బతుకొచ్చింది... ఎవరు..?**

**కౌశిక్ వర్సెస్ గాంధీ**

**భౌతిక దాడులు.. పాడి ఇంటిపై దాడి**

**అరికపుడి బైఠాయింపు... నోటికొచ్చినట్టు బూతులు**

**తెలంగాణ - ఆంధ్రా సెంటిమెంట్**

**తెలంగాణ భవన్ ముట్టడి**

**సీపీ ఆఫీసు ఎదుట బీఆర్ఎస్ ధర్నా**

**హరీష్ సహా నేతల అరెస్ట్**

2

**పోలీసుల అతిలో హరీష్ కు గాయాలు..**

వీళ్లు నిజంగా ఎమ్మెల్యేలా.. లేక వీధి రౌడీలా..? అసెంబ్లీకి వెళ్లారా.. లేక హనుమాన్ వ్యాయామశాలకు వెళ్లి ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడ్రా బాబులు అంటే.., పర్సనల్ విషయాలను పబ్లిక్ చేసుకుంటూ పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నారు. ప్రజలతో శభాష్ అనిపించుకోకున్నా పర్లేదుగానీ, ఛీ వీళ్లా.. అనే స్థాయికి దిగజారుతున్నారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారం హైకోర్టు ఎపిసోడ్ తర్వాత రాజకీయం వేడి పెరగడంతో మాటల యుద్ధం మితిమీరింది. ఆ ముచ్చట కాస్త కౌశిక్ వర్సెస్ అరికెపూడి గా మారింది. చీరెలు, గాజులు అంటూ వ్యంగ్యాలు విసురుకుంటూ, చెప్పులు చూపుకుంటూ సాగిన యవ్వారం గురువారం ఏకంగా ఇండ్లపై దాడి వరకు వెళ్లింది. బీఆర్ఎస్ సీనియర్లు పాడికి మద్దతుగా వెళ్లడంతో ఉద్రిక పరిస్థితి తలెత్తింది. మాజీ మంత్రి కాంగ్రెస్ సర్కార్ తీరు, సీఎం రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న విధానాలను ఎండగట్టాడు. ఈ క్రమంలో పోలీసులు హరీష్ సహా నేతలందరినీ అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. తోపులాటలో హరీష్ రావుకు తీవ్ర గాయాలు కావడంతో ఉత్కంఠ నెలకొంది. రోజంతా రాజధాని కేంద్రంగా సాగిన హస్తం, గులాబీ లొల్లి రాష్ట్ర రాజకీయాల పరిస్థితిని కళ్లకు కట్టింది.

- జనపదం, హైదరాబాద్ బ్యూరో







# పండు ఫసక్కా..?!

## కోటలకు బీటలేనా..?

**హస్తంలో రాజుకున్న కుంపటి..** | **చాపకింద నీరులా సీఎం వర్సెస్ సీనియర్స్..** | **ఏపీలో ఉత్తమ్... ఢిల్లీ లో రేవంత్**

**కాంగ్రెస్ లో పీక్స్‌కు చేరిన పంచాయితీ** | **చంద్రబాబు ఉత్తమ్ దంపతుల భేటీ.. రేవంత్ పై ఫిర్యాదులు** | **ఉత్తమ్ పై రేవంత్ నిఘా**

**జనపదం, బ్యూరో**

కాంగ్రెస్ లో కుమ్ములాట క్లైమాక్స్ కు వచ్చినట్టే అనిపిస్తున్నది. సీనియర్లు వర్సెస్ సీఎంగా ఉన్న ఆట ఇప్పుడు ఉత్తమ్ వర్సెస్ ముఖ్యమంత్రిగా మారినట్టుగా తోస్తోంది. ముఖ్యమంత్రి ఢిల్లీలో పర్యటిస్తుండగా, ఉత్తమ్ అండ్ ఫ్యామిలీ ఆంధ్ర ప్రదేశ్ లో పర్యటిస్తున్నారు. రేవంత్ రెడ్డి అతిని ఆయనకు గురువుగా అభివర్ణించే ఏపీ సీఎం చంద్రబాబుకు చెప్పడానికి వెళ్లినట్టు సమాచారం. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా రేవంత్ దూకుడు, హైడ్రా పేరుతో సీనియర్లను, ఇతర ప్రముఖులను ఇబ్బంది పెట్టే తీరును పూసగుచ్చినట్టు చెప్పి, కాస్త కళ్లెం వేయడానికి పూనుకోవాలని కోరినట్టు సమాచారం.

**కోటలకు బీటలేనా..?**

క్లైమాక్స్ కాంగ్రెస్ పాలిటిక్స్. వర్గ పోరు రాష్ట్రం ఎల్లలు దాటున్నదా..? గ్రూపు రాజకీయాలు ముష్టి యుద్ధాల దాకా వెళ్తున్నాయి. విస్తరణకు ముందే ముఖ్యమంత్రి సీటుకే ఉత్తమ్ కోటరీ ఎసరు పెట్టబోతుందా..? త్వరలో నంబర్ గేమ్ కు కూడా సిద్ధపడుతున్న దాఖలాలు సుస్పష్టం. లోపల ఎన్నైనా ఉండొచ్చుగానీ ఇప్పటి వరకు రాష్ట్ర కాంగ్రెస్ ఓ తొనగని కుండ మాదిరి బిల్డప్ తో నడక సాగిస్తున్నది. ఇక సర్కార్ కు సీనియారిటీ పెరుగుతుండడంతో అటు మంత్రులు, ఇటు ముఖ్యమంత్రి ఎవరికి వారుగా సొంత బలం పెంచడానికి ప్రాధాన్యం ఇస్తున్న చాయలు కనిపిస్తున్నాయి. స్వంతంత్ర నిర్ణయాలను పెద్దల సమక్షంలో పంచుకుంటూ ఒఖరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నంత పనిచేస్తున్నారు.

**హస్తంలో రాజుకున్న కుంపటి..**

సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వర్గ విస్తరణ, రాష్ట్రానికి పంట నష్టం సాయం, వరద సాయం కోసం ఢిల్లీలో మకాం వేసిన విషయం తెలిసిందే. అదే ......(తరువాయి 4లో)

**పండు పక్వానికి వచ్చినట్టుగానే అనిపిస్తున్నది. పైకి పచ్చగానే కనిపిస్తున్న లోపల మాత్రం కుళ్లుతున్న వాసన స్పష్టంగా తెలుస్తున్నది. అవకాశం కోసం కాచుక్కూర్చున్న సీనియర్లకు, ఎప్పుడేం జరుగుతుందో తెలియక సీఎంకు మధ్య ఊబి ఊగిసలాడుతున్నది. అంతా భేష్ గానే ఉన్నట్టుగా హైకమాండ్ కు కలరింగ్ ఇస్తున్నా, లోపల మాత్రం కొరికి చంపుకునేంత పగలతో రగిలిపోతున్న వైరి వర్గాలు స్నేహాన్ని నటిస్తున్న ఆనవాళ్లు ఇట్టే తెలిసిపోతున్నాయి. గురువుకు శిష్యుడి గురించి చెప్పేందుకు 'సిపాయి' వెళ్లగా, సోల్జర్ ఏదో చేస్తున్నాడు కాస్త కన్నేసి ఉంచాల్సిన సందర్భమని హస్తినా నుంచి అనుచరులను పురమాయించుకున్న అవసరం ఆయనది. కాంగ్రెస్ ఎప్పుడూ ఒక్కరితో కొసెల్లుడు కష్టమే అనే ఆనవాయితీని మరోమారు నిజం చేసేందుకు ఎవరికి వారుగా ఓ చెయ్యేసేందుకు వెనకాడని పరిస్థితుల్లో రాష్ట్ర రాజకీయం కాక రేపుతున్నది.**

## కౌశిక్ వ్యాఖ్యలు సరికాదు...

- బతకడానికి వచ్చినోళ్లు అనడం తప్పు..
- వాళ్ల ఓట్లుకావాలిగానీ, వాళ్లు వద్దా..?
- చేజారకుంటే సర్కార్ సేఫ్..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్..

3



బతకడానికి వచ్చినోళ్ల ఓట్లుకావాలిగానీ, వాళ్లు మాత్రం వద్దా..? ఇదెక్కడి న్యాయం. కౌశిక్ రెడ్డి అలా మాట్లాడడంపై కేసీఆర్, కేటీఆర్ సమాధానం చెప్పాలి అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. ఎమ్మెల్యేలు చేజారకుంటే సర్కార్ కొచ్చిన ధోకా ఏమీ లేదన్నారు. పీఏసీ ప్రతిపక్షానికే ఇచ్చామని, దాన్ని రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. -జనపదం, ఢిల్లీ



## విమోచనమెప్పటికో...?

- అధికారికంగా జరపాల్సిందే..
- ఆరు గ్యారంటీలు అమలు చేయాలి
- హైడ్రా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- త్వరలో హైదరాబాద్‌లో బీజేపీ దీక్ష
- సమావేశానికి బండి, కిషన్ రెడ్డి డుమ్మాపై సర్వతా చర్చ..

**జనపదం, హైదరాబాద్ :**

విమోచన దినోత్సవాన్ని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రజలకు ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా వాటిని అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ లోని బీజేపీ ఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన బీజేఎల్పీ సమావేశం ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో బీజేపీ ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, అరవింద్, డీకే అరుణ, గోడెం నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, కె.వెంకట రమణారెడ్డి, ......(తరువాయి 3లో)



## ఇదో కొత్త డ్రామా...

**బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ ఏకీహే...**

**రాహుల్ వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే వేషాలు...**

**అందుకే ఎమ్మెల్యేల కొత్త నాటకం**

**ఐఎన్సీ అంటే ఇటాలియన్ కాంగ్రెస్ పార్టీ**


**కేంద్రమంత్రి బండి సంజయ్**

**సికింద్రాబాద్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు**

3

## హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు..

### స్థానికత అంశంపై సర్కార్ పిటిషన్



**జనపదం, బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పులో తెలంగాణలోని మెడికల్, డెంటల్ కళాశాలల ప్రవేశాల కోసం స్థానికులకు ప్రత్యేక అవకాశాన్ని కల్పించాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన జీవో 33 లోని సవరణ 3(ఏ)ను రద్దు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అమలులో ఉన్న 85శాతం స్థానిక కోటా కింద నేషనల్ స్థాయిలో ప్రవేశాలు అందించడాన్ని తప్పని సరిగా అమలు చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద, ఈ కేసును వెంటనే విచారించాలని ప్రభుత్వ తరపున న్యాయవాది అభ్యర్థించారు. సీజేఐ ధర్మాసనం, త్వరలో విచారణ చేపడతామని తెలిపింది.

3



## సీతారాం ఏచూరి కన్నుమూత

- చికిత్స పొందుతూ మృతి
- చెన్నైలో పుట్టి హైదరాబాద్‌లో పెరిగిన సీతారం
- ఎయిమ్స్‌కు ఏచూరి భౌతిక కాయం
- పలువురి సంతాపం

2

## వరద నష్టం రూ.9 వేల కోట్లు



- ఉదారంగా సాయం చేయండి..
- వరదలతో అతలాకుతలమయ్యాం..
- మొత్తం 8 రంగాలు అధ్వానమయ్యాయి
- 35 మంది చనిపోయారు..
- ప్రాథమిక అంచనా రూ. 5 వేల కోట్లు
- 17,916 మంది నిరాశ్రయులయ్యారు
- కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక

3



## బలగంకు అవార్డులు

- బలగం క్లైమాక్స్ సాంగ్ కొంరమ్మ, మొగిలయ్యకు జీవన సాఫల్య పురస్కారం
- అస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ కు, పొన్నం సత్తయ్యకు కూడా
- 13న రవీంద్రభారతిలో స్పీకర్, మంత్రుల చేతుల మీదుగాప్రదానం
- అవార్డు గ్రహీతలకు నగదుతో పాటు.. మెమోంటోలతో సత్కారం

2

# ఎమ్మెల్యేలేనా..? లేకా..?

- వీధి రౌడీల్లా వ్యవహారం..
- బతుకు దెరువు... బతుకొచ్చింది... ఎవరు..?
- కౌశిక్ వర్సెస్ గాంధీ
- భౌతిక దాడులు.. పాడి ఇంటిపై దాడి
- అరికపుడి బైఠాయింపు... నోటికొచ్చినట్టు బూతులు
- తెలంగాణ- ఆంధ్రా సెంటిమెంట్
- తెలంగాణ భవన్ ముట్టడి
- సీపీ ఆఫీసు ఎదుట బీఆర్ఎస్ ధర్నా
- హరీష్ సహా నేతల అరెస్ట్
- పోలీసుల అతిలో హరీష్ కు గాయాలు..



**జనపదం, హైదరాబాద్:** తెలంగాణలో రాజకీయ వాతావరణం హీటెక్కిపోయింది. హైదరాబాద్‌లో హైటెన్షన్ నెలకొంది. మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ సీపీ కార్యాలయం వద్ద వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కుందుర్గ్ పోలీస్ స్టేషన్‌కు నేతలను తరలించారు. గురువారం ఉదయం సమయంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నివాసంపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు చేసిన దాడి ఘటనపై జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌కు ఫిర్యాదు చేశారు.

## అరెస్ట్ చేయాలని డిమాండ్..

కౌశిక్ రెడ్డిపై దాడిని సుమోటుగా తీసుకున్న పోలీసులు.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు 30 మందిపై కేసు నమోదు చేశారు. అరికెపూడి గాంధీని ఏ1గా పేర్కొంటూ మొత్తం 30 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎఫ్ఐఆర్ కాపీని బీఆర్ఎస్ నేతలకు అందించారు. అయితే.. అందులో ఐపీసీ సెక్షన్ 307 (హత్యాయత్నం) కింద కేసు పెట్టకపోవడంతో.. హరీష్ రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు. కౌశిక్ రెడ్డిపై అరికెపూడి గాంధీ హత్యాయత్నం చేసినట్టుగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంత వరకు వెనక్కి తగ్గేదిలేదంటూ భీష్మించుకుని కూర్చుకున్నారు. అరికెపూడితో పాటు దాడికి యత్నించిన ఆయన అనుచరులను, అందుకు సహకరించిన పోలీసులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ చేయకపోతే.. కోర్టుకు వెళ్తామని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## హరీష్ రావు సహా అందరినీ అదుపులోకి..

ఆందోళన విరమించి.. అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు ఎంత చెప్పినా వెనక్కి తగ్గకపోవడంతో బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో భాగంగా.. మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్‌తో పాటు పల్లా రాజేశ్వర్ రెడ్డి సహా పలువురు నేతలను పోలీసులు బలవతంగా అదుపులోకి తీసుకున్నారు. మొత్తం రెండు బస్సుల్లో బీఆర్ఎస్ నేతలను తరలిస్తున్నారు.

## అరికెపూడి గాంధీపై హత్యాయత్నం కేసు..

అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు చేసిన దాడిపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కౌశిక్ రెడ్డి రాత పూర్వకంగా కంప్లైంట్ ఇచ్చారు. మాజీ ఐఏఎస్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సహాయంతో కౌశిక్ రెడ్డి కంప్లైంట్ ఇవ్వగా.. పోలీసులు అరికెపూడి గాంధీపై సెక్షన్ 307 (హత్యాయత్నం) కేసు నమోదు చేసినట్టు సమాచారం. ఇదే కాకుండా.. బీఎస్ఎస్ చట్టంలోని 11 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఎస్సై మహేష్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. అంతకుముందు అరికెపూడి గాంధీని అరెస్ట్ చేసిన పోలీసులు.. నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా.. 41 నోటీసులు ఇచ్చి వ్యక్తిగత పూచికత్తు మీద అరికెపూడి గాంధీని పోలీసులు వదిలిపెట్టారు. విడుదలైన అనంతరం.. కౌశిక్ రెడ్డిపై కూడా తాను ఫిర్యాదు చేసినట్టు గాంధీ తెలిపారు. ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టినట్టుగా ఫిర్యాదు చేసినట్టు వివరించారు.

## ఇదేం ప్రజాపాలన..?

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. ఇదేం ప్రజాపాలన..? ఇదేం ఇందిరమ్మ రాజ్యం? అని హరీశ్ రావు ప్రశ్నించారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డికి ఇంటికి వెళ్లిన బీఆర్ఎస్ నేతలు ఆయన్ని పరామర్శించారు. అరెకపూడి గాంధీ అనుచరుల దాడిలో ధ్వంసమైన పరిసరాలను పరిశీలించారు. పోలీసులే ఎస్కార్టు ఇచ్చి మరీ అరికెపూడిని తీసుకువచ్చారన్న హరీశ్‌రావు ఇదేనా ప్రజా పాలన అంటే అని దుయ్యబట్టారు. గాంధీని ఎందుకు హౌస్ అరెస్టు ఎందుకు చేయలేదని నిలదీశారు.

## ఏసీపీ సస్పెండ్ చేయాలి

కౌశిక్‌రెడ్డి ఇంటి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైబరాబాద్ సీపీ కార్యాలయానికి వెళ్లారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల వాహనాలను పోలీసులు అడ్డుకున్నారు. తీవ్రంగా స్పందించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమను అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీపీ కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మాత్రమే సీపీ కార్యాలయంలోకి పోలీసులు అనుమతించగా సైబరాబాద్ జాయింట్ సీపీ డోయల్ డేవిస్‌కు వారు ఫిర్యాదు చేశారు. అరెకపూడి గాంధీ అనుచరులు రెచ్చిపోయి దాడి చేస్తుంటే నిలువరించలేని ఏసీపీ, సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేసే వరకూ కదలబోమంటూ సైబరాబాద్ సీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సుమారు రెండు గంటలపాటు ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహా మిగతా నేతలను బలవంతంగా వ్యాన్ ఎక్కించి రెండు వాహనాల్లో వేర్వేరు మార్గాల్లో తరలించారు. కొంత మంది బీఆర్ఎస్ నేతలను కేశంపేట వైపు, మరికొంత మంది నాయకుల్ని షాద్‌నగర్ వైపు తీసుకెళ్లారు.అరెస్ట్ సమయంలో తోపులాటలో హరీశ్‌రావు చేతికి గాయం తగిలింది.

## దాడిని లైట్ తీస్కోం..


### మాజీ మంత్రి హరీశ్ రావు



ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీల మధ్య వివాదం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కొండాపూర్‌లోని కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ పోలీసులు, ప్రభుత్వం వైఫల్యం చెందాయని, కౌశిక్ రెడ్డిపై ప్రభుత్వమే దాడి చేయించిందని ఆరోపించారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సిద్దిపేటలో తన కార్యాలయంపై దాడి చేశారని, ఖమ్మంలో తమపై దాడి విషయమై ఫిర్యాదు చేస్తే ఇప్పటికీ ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పరిస్థితులు ఎలా ఉండేవి, ఇప్పుడు ఎలా ఉన్నాయని హరీశ్ రావు ప్రశ్నించా రు. ఒక ఎమ్మెల్యే పైనే దాడి జరిగితే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇక ఏ కంపెనీలైనా ఆసక్తి చూపుతాయా అని నిలదీశారు. "తొమ్మిది నెలల్లో తొమ్మిది కమ్యూనల్ సంఘటనలు చోటుచేసుకున్నాయని, కొమ్ము కాస్తున్న పోలీసు అధికారులు భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. మా సహనాన్ని పరీక్షించవద్దు. రేవంత్ రెడ్డిలా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించబోమన్నారు. ఎమ్మెల్యే గాంధీ భాష చూసి సభ్య సమాజం అసహ్యించుకుంటోందన్నారు.

## కౌశిక్ రెడ్డి దొంగ..

### ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



కౌశిక్‌రెడ్డి దొంగ అని గమనించకుండా పార్టీలో స్థానం ఇచ్చారని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. బీఆర్ఎస్‌లోకి వచ్చినప్పటి నుంచి ఆయన తీరు సరిగాలేదని పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డి తీరు వల్లనే బీఆర్ఎస్ పార్టీ ఓటమి చెందిందని ఆరోపించారు. అతను కోవర్టుగా వ్యవహరించారని, అంతే కాకుండా ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నారని అరికెపూడి గాంధీ ధ్వజమెత్తారు. కౌశిక్ సవాల్‌ను స్వీకరించిన అరికెపూడి కొండాపూర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. 'మీ ఇంటికొస్తా.. జెండా ఎగరేస్తా' అంటూ కౌశిక్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన గాంధీ ఆయన రాకపోతే తానే స్వయంగా అతడి ఇంటికి వెళ్తానని సవాల్ చేసిన విషయం తెలిసిందే. అన్నట్టుగానే తన అనుచరులతో కలిసి అరికెపూడి గాంధీ కౌశిక్ ఇంటికి చేరారు. అప్పటికే కౌశిక్ రెడ్డి ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. కౌశిక్‌రెడ్డి ఇంటివద్ద తన అనుచరులతో కలిసి అరెకపూడి గాంధీ బైఠాయించగా పోలీసులు ఆయన్ను పంపించే ప్రయత్నం చేశారు. కౌశిక్‌రెడ్డిని బయటకు పిలవాలని, లేదంటే తననే లోపలికి పంపించాలని అరెకపూడి డిమాండ్ చేశారు. అతడి ఇంటి వద్ద బైఠాయించి అరెకపూడి అనుచరులు నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, అరెకపూడి గాంధీ అనుచరుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కొందరు అనుచరులు గేటు తోసుకుంటూ కౌశిక్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించారు. అనంతరం గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు.

## కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని దారుణం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పట్టపగలే ఎమ్మెల్యేపై హత్యాయత్నామా అని ప్రశ్నించారు. మన రాష్ట్రం ఎటు పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్షన్, రౌడీ రాజకీయాలకు తెలంగాణను అడ్డాగా మార్చేస్తుంటే బాధగా ఉందన్నారు. కౌశిక్ రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచి అరికెపూడి గాంధీ గూండాలతో దాడి చేయిస్తారా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమ్మెల్యేలకు కూడా రక్షణ లేకపోవడమేనా అని నిలదీశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై న్యాయపరంగా పోరాడుతున్నందునే కౌశిక్ రెడ్డిని టార్గెట్ చేశారన్నారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించిన దాడేనని ఆరోపించారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇలాంటి ఉడుత ఊపుల దాడులకు బెదిరేది లేదని స్పష్టం చేశారు. ఇంతకు మించిన ప్రతిఘటన తప్పదంటూ కేటీఆర్ హెచ్చరించారు.

## రెండు గంటలు తిప్పారు..



సైబరాబాద్ సీపీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ప్రతినిధులును అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని రెండు గంటలుగా బస్సుల్లోనే తిప్పుతున్నారు. పోలీసులు రెండు వాహనాల్లో వేర్వేరు ప్రాంతాలకు తరలిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలను ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పకుండా వాహనాల్లోనే తిప్పుతున్నారు. హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు ఉన్న వాహనాన్ని శ్రీశైలం రోడ్డుపైపు మళ్లించారు. కడ్తాల్ మీదుగా కల్వకుర్తికి తరలిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే వంద కిలో మీటర్లకుపైగా వాహనాల్లో తిప్పారు. ఓ వాహనాన్ని తలకొండపల్లి, మరొకటి కేశంపేట వైపు తిప్పారు. తలకొండపల్లి వద్ద ఎమ్మెల్యేలను తరలిస్తున్న వాహనాన్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. కేశంపేట మండలం కొత్తపేట వద్ద వాహనానికి అడ్డుగా బీఆర్ఎస్ శ్రేణులు బైఠాయించారు.

## ఎమ్మెల్యేకే రక్షణ లేదా..?

### ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



కాంగ్రెస్ గూండాలు తనపై హత్యాయత్నం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. తన ఇంటి కిటికీ అద్దాలు ధ్వంసం చేశారని చెప్పారు. ప్లాన్ ప్రకారమే గుడ్లు, టమాటాలు తీసుకొచ్చారని తెలిపారు. దాడులు చేస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. చంపే ప్రయత్నం చేస్తే.. మేమేందో కూడా చూపిస్తామన్నారు. గూండాలతో వచ్చి దాడి చేయడం ఎంతవరకు కరెక్టు అని ప్రశ్నించారు. హారతులతో స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉంటే.. తమపై రాళ్ల దాడులు చేస్తారా అన్నారు. రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యేకే రక్షణనే లేదని కౌశిక్ రెడ్డి అన్నారు. సామాన్య ప్రజలకు ప్రభుత్వం రక్షణకు ఎలా ఇస్తుంది? అని ప్రశ్నించారు. తనను హత్య చేయడానికి తన ఇంటి వద్దకు వచ్చారని ఆరోపించారు. శుక్రవారం 11 గంటలకు బీఆర్ఎస్ పార్టీ తడాఖా చూపిస్తామంటూ కౌశిక్ రెడ్డి సవాల్ విసిరారు. అరెకపూడి గాంధీ చేసిన చర్యకు ప్రతిచర్య ఉంటుందన్నారు. అరెకపూడి గాంధీ కృష్ణా జిల్లా నుంచి హైదరాబాద్‌కు వచ్చారన్న కౌశిక్, తాను నిఖార్సైన తెలంగాణ బిడ్డనని తెలిపారు. అరికెపూడి గాంధీ మాట్లాడిన మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా. మైనంపల్లి హన్మంత్ రావు అల్వాల్‌లో మీటింగ్ పెట్టి ఇదే విధంగా కేటీఆర్‌ను దూషించారు. 50 వేల ఓట్ల మెజార్టీతో ఓడిపోయారు. రేపు నీ నియోజకవర్గంలో నీకు కూడా అదే గతి పడుతుంది. ఉప ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో మా దమ్మేందో చూపిస్తామని, ఏదో తిట్టి డైవర్షన్ చేయడం కాదు.. సూటిగా అడుగుతున్నా సమాధానం చెప్పాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఎస్సీ వర్గీకరణపై కమిటీ..

**జనపదం, హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ కో-చైర్మన్‌గా మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవిని ప్రభుత్వం నియమించింది. ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ అంశంతో ముడిపడి ఉన్న అన్ని అంశాలపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

## 4కిలోల బంగారం పట్టివేత..

**జనపదం, బ్యూరో:** హైదరాబాద్‌కు అక్రమంగా బంగారం తరలిస్తున్న ఇద్దరిని డీఆర్ఐ అధికారులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దాదాపు 4 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.3 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. కోల్‌కతా నుంచి రోడ్డు మార్గం ద్వారా కారులో నగరానికి పసిడిని రహస్యంగా తరలిస్తున్నారనే సమాచారంతో అధికారులు సోదాలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై డీఆర్ఐ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 280 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత..

**జనపదం, ఆదిలాబాద్:** ప్రభుత్వం పేదలకు అందించే (పీడీఎఫ్) రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..నిర్మల్ నుంచి మహారాష్ట్రలోని గొండియా జిల్లాకు రేషన్ బియ్యం తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. బోరజ్ చెక్‌పోస్ట్ వద్ద సోదాలు నిర్వహించి డీసీఎంలో తరలిస్తున్న 280 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టుబడిన బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు బదిలీ చేశారు.

## 'కౌశిక్'పై దాడితో కాంగ్రెస్ కు సంబంధం లేదు

**అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే**
**అందుకే ఆయనకు పీఏసీ చైర్మన్ ఇచ్చాం**
**తెలంగాణలో ఉప ఎన్నికల ప్రసక్తే లేదు**
**ఢిల్లీలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



**జనపదం, ఢిల్లీ:** ప్రతిపక్ష పార్టీకి చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడితో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరణ ఇచ్చారు. రాజకీయాల్లో విమర్శలు, సద్విమర్శలు సర్వ సాధారణమన్న ఆయన విమర్శలు చేసే సమయంలో భాష చాలా ముఖ్యమని చెప్పారు. దాడులు, ప్రతిదాడులను ఏ ఒక్కరూ సమర్థించరని చెప్పారు. వాస్తవానికి అరికపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని అందుకే ఆయనకు పీఏసీ చైర్మన్ ఇచ్చామని స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ సవాళ్లను కేటీఆర్ కేటీఆర్ పట్టించుకునే స్థితిలో లేరన్నారు. ప్రతిపక్ష పాత్ర ఇస్తే దాన్ని కూడా సమర్థవంతంగా నిర్వహించే స్థితిలో లేరని విమర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ ఉన్నారని పీసీసీ చీఫ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులపై స్పందించిన మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ లో చేరేందుకు ఇంకొంత మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు అసెంబ్లీ స్పీకర్ కు సమయం ఇచ్చిందన్న ఆయన ఆ త్వరలోనే ఇంకొంత మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు రాబోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఒకవేళ వచ్చినా కాంగ్రెస్ ఖాతాలోనే చేరుతాయని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్త మొదలుకొని సీనియర్ నాయకులను కలుపుకొని 2029 ఎన్నికలే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అందులో ఇప్పుడు వచ్చిన స్థానాల కంటే ఎక్కువ స్థానాల్లో గెలిచి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ ఉంటుందన్న ఆయన అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు.



## హైదరాబాద్ లో ఇరాన్ పర్యాటక రోడ్ షో

### హాజరైన ఇరాన్ డిప్యూటీ మంత్రి షల్బాఫియాన్, మంత్రి జూపల్లి

**జనపదం, హైదరాబాద్:** శతాబ్దాలుగా భారతదేశానికి ఇరాన్‌తో చారిత్రక, సాంస్కృతిక అనుబంధం ఉందని, భారత్ తో సాంస్కృతిక, పర్యాటక సంబంధాల మార్పిడిని మరింత వేగవంతం చేసుకునేందుకు పర్యాటక నూతన విధానం అమలు చేస్తున్నట్టు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ శాఖ డిప్యూటీ మంత్రి షల్బాఫియాన్ అన్నారు. ఇరాన్ – భారతదేశం, తెలంగాణ రాష్ట్రాల మధ్య సాంస్కృతిక, పర్యాటక రంగాల్లో పరస్పరం సహకరించుకోవడం లక్ష్యంగా హైదరాబాద్ లోని ఓ హోటల్ లో గురువారం ఇరాన్ పర్యాటక రోడ్ షో ఈవెంట్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా షల్బాఫియాన్ మాట్లాడుతూ... ఇరాన్ పై సానుకూల వాతావరణాన్ని ప్రమోట్ చేయడం, అంతర్జాతీయ పర్యాటకులను రప్పించడం, కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం, సాంస్కృతిక అనుబంధాన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా భారతదేశంలో పర్యాటక రోడ్ షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సందర్శకుల మార్పిడి వల్ల రెండు దేశాల్లో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్, భారతదేశం మధ్య లోతైన సాంస్కృతిక, కళాత్మక సంబంధాలు ఉన్నాయని, ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో కూడా ఇరాన్ కు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, హైదరాబాద్ రెండు దేశాలను కలిపే వారధిగా నిలుస్తుందని అభివర్ణించారు. ఇరాన్ దేశంలోని చారిత్రక, వారసత్వ, పర్యాటక ప్రాంతాల్లో పర్యటించి, పాశ్చాత్య దేశాలు, మీడియా చిత్రీకరించిన దానికి భిన్నంగా ఇరాన్ ఉందని తెలుసుకుంటారని పేర్కొన్నారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ... ఇరాన్ సాంస్కృతిక సంపద గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి, ఇరు దేశాల మధ్య పర్యాటక సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ రోడ్ షో ఒక గొప్ప వేదికగా నిలిచిందని అన్నారు. ఇరాన్ పర్యాటక ఆకర్షణలపై అవగాహన కల్పించుకునే అవకాశం లభించిందని తెలిపారు. ప్రపంచ పర్యాటక పటంలో తెలంగాణ ఒక ప్రముఖ గమ్యస్థానంగా ఉద్భవించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, ఇరాన్ కాన్సులేట్ సెకండ్ కన్సుల్ మోహసిన్ మొగద్దమి, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ టూరిజం డైరెక్టర్ జనరల్ షోజేహి, రిజీనల్ పాస్పోర్ట్ అధికారి స్నేహజ, తెలంగాణ పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, వివిధ ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి కన్నుమూత

- చికిత్స పొందుతూ మృతి
- చెన్నైలో పుట్టి హైదరాబాద్‌లో పెరిగిన సీతారం
- ఎయిమ్స్‌కు ఏచూరి భౌతిక కాయం



**జనపదం, ఢిల్లీ:** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూశారు. శ్వాసకోశ సంబంధిత, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆగస్టు 19 నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్సం పొందుతున్నారు. వెంటిలేటర్‌పై ఆయనకు 25 రోజులుగా వైద్యులు చికిత్స అందించారు. చివరికి ఆయన పరిస్థితి విషమించడంతో గురువారం తుది శ్వాస విడిచారు. 72 ఏళ్ల ఏచూరి సీపీఎం నేతకు ఇటీవల క్యాటరాక్ట్ ఆపరేషన్ కూడా జరిగింది. డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ గౌరి నేతృత్వంలో వైద్య బృందం ఆయనకు చికిత్స అందించింది. అయితే ఇన్‌ఫెక్షన్ తొలగించేందుకు ఉపయోగించిన మందులు పనిచేయకపోవడంతో జపాన్ నుంచి ప్రత్యేక మందులు కూడా తెప్పించారు. ఢిల్లీలోని ఎయిమ్స్ చికిత్స పొందుతున్న ఆయన తుది శ్వాస విడిచారు. దీంతో కమ్యూనిస్ట్ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

### చెన్నైలో పుట్టి.. హైదరాబాద్‌లో పెరిగి..

సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న చెన్నైలో జన్మించారు. అతను హైదరాబాద్‌లో పెరిగాడు. పదో తరగతి వరకు ఆల్ సెయింట్స్ హైస్కూల్లో చదివారు. 1969 తెలంగాణ ఉద్యమం సమయంలో ఢిల్లీ చేరుకున్నారు. ఏచూరి ఢిల్లీలోని ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్‌లో అడ్మిషన్ తీసుకున్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ హయ్యర్ సెకండరీ పరీక్షల్లో ఆల్ ఇండియా ర్యాంక్ వన్ సాధించారు. అతను ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో మొదటి ర్యాంక్‌తో ఎకనామిక్స్‌లో తన బీఏ (ఆనర్స్) పూర్తి చేశారు. ఆ తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) నుంచి ఆర్థికశాస్త్రంలో ఎంఏ చేశారు. పీహెచ్‌డీ కోసం జేఎన్‌యూలో అడ్మిషన్ తీసుకున్నారు. అయితే 1975లో ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయినందున పూర్తి చేయలేకపోయారు. 1974లో భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ)లో చేరిన ఏచూరి సంవత్సరం తరువాత అతను కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) లో చేరారు. 1975లో సీపీఎంలో చేరారు. వరుసగా మూడుసార్లు జాతీయ ప్రధాన కార్యదర్శి అయ్యారు.

### ఎయిమ్స్‌కు భౌతిక కాయం

సీపీఎం దివంగత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు అప్పగించనున్నారు. ఏచూరి మృతదేహాన్ని ఎంబామింగ్ నిమిత్తం శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు మార్చురీలో ఉంచనున్నారు. అనంతరం వసంత్ కుంజ్‌లోని ఆయన ఇంటికి తరలిస్తారు. 14వ తేదీ ఉదయం 11 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయం ఏకేజీ భవన్‌లో మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. ఆ తర్వాత ఏచూరి భౌతిక దేహాన్ని ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలోని అనాటమీ విభాగానికి అప్పగించనున్నారు

### పలువురి నివాళి..

సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే ప్రముఖ సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి మరణించారనే వార్త తెలిసి చాలా బాధపడ్డానని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఇక ఏచూరి మృతిపట్ల రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సంతాపం ఘటించారు. సీతారాం ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. సీతారాం ఏచూరి చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని అన్నారు.

## బలగం మూవీకి అవార్డులు

### నేడు రవీంద్రభారతిలో స్పీకర్, మంత్రుల చేతుల మీదుగా ప్రదానం



**జనపదం, వరంగల్:** తెలంగాణ వేణు దర్శకత్వం వహించిన 'బలగం' ఎన్నో అవార్డులు సొంతం చేసుకుంది. సినిమాలో క్లైమాక్స్‌సాంగ్ పాడిన శారద గాళ్ల... బలగం కొంరమ్మ, మొగిలయ్యకు తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పొన్నం సత్తయ్యగౌడ్ 14 వర్ధంతి సందర్భంగా పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం 2024 అవార్డులను ప్రకటించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ కు, బలగం సినిమా క్లైమాక్స్ సింగర్స్ బలగం కొమురమ్మ, మొగిలయ్యకు ఈ అవార్డులను కమిటీ ప్రకటించింది. పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.51 వేల నగదుతో పాటు మోమెంటో, శాలువాలతో సత్కరిస్తారు. ఈ నెల 13న సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి శ్రీకృష్ణారావు, తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు హజరుకానున్నారు. ఈ అవార్డును 2022 లో నాళశ్వరం శంకర్(రచయిత), ఒగ్గుకథ ధర్మయ్యకు 2023లో ప్రముఖ కథ రచయిత నలిమెల భాస్కర్, ఆరుణోదయ విమలక్కకు అందించారు. 2024 లో అస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ కు, బలగం కొమురమ్మ, మొగిలయ్యకు అందించనున్నారు.తెలంగాణ లో శారదగాళ్ల కళలు బలగం సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా బలగం కొమురమ్మ, మొగిలయ్యతో మరోసారి చర్చకు వచ్చాయి. ఎక్కడో మారుమూల గ్రామానికి చెందిన ఈ కళకారులు అస్కార్ అవార్డు గ్రహీతతో సమానంగా ఈ అవార్డు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం అవుతుంది.



# సాయం ఎంత చేసినా తక్కువే..

- మున్నేరు బాధితులకు మనోధైర్యం కల్పించాలి
- సర్కారు శాశ్వత పరిష్కారం చూపాలి
- ప్రజల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తా..
- ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్
- వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

**జనపదం, ఖమ్మం :** మున్నేరు వరద బాధితులకు ఎంత సహాయం చేసినా అది తక్కువే అవుతుందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని మున్నేరు వాగు వరద బాధితుల కోసం హైదరాబాదులో నివసించే ఖమ్మం మిత్రులు, మదార్ సాబ్ చారిటబుల్ ట్రస్ట్ ల ఆధ్వర్యంలో స్థానిక నయాబజార్ కళాశాల ఆవరణలో వరద బాధితులకు ఏర్పాటు చేసిన నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమంలో మొదట ఆయన పాల్గొని బాధితులకు పంపిణీ చేశారు. అనంతరం బొక్కల గడ్డ, రాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాలలో పర్యటించి బాధితుల కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. వారితో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఇలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రభుత్వం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇటీవల కాలంలో వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మున్నేరు వాగు వరద బాధితులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారని, వారికి తక్షణ సహాయంతో పాటు మనోధైర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విపత్తు నివారణ చట్టం ద్వారా బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలని కోదండరామ్ కోరారు. ప్రభుత్వంతో పాటు అనేకమంది దాతలు ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. ఇంకా సహాయ సహకారాలు అందించే విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని బాధితులకు కోదండరాం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా ఇన్చార్జ్ శంకర్ రావు, జిల్లా కన్వీనర్ బాబు, టీఎస్జీవో మాజీ అధ్యక్షుడు రంగరాజు, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# విమోచనమెప్పటికో ..?

**(మొదటిపేజీ తరువాయి)**

పైడి రాకేష్ రెడ్డి, పాల్వాయి హరీష్ బాబు, రామారావు పాటిల్, దన్పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఎండోమెంట్ భూములను రక్షణ కోసం పోరాటం చేయాలని, బీజేపీ సభ్యత్వ నమోదు డ్రైవ్ ను వేగవంతం చేయాలని నిర్ణయించారు. అనంతరం ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని, అలాగే రైతు భరోసా ఇవ్వాలన్నారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. వరత ప్రభావిత ప్రాంతాల్లో సర్వే చేయించి బాధిత రైతులకు ఆర్థికసాయం అందించాలన్నారు. చెరువులను , కుంటలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన అక్రమార్కులపై హైడ్రా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై అనర్హత వేసే విషయంలో హైకోర్టు ఆదేశాలను అసెంబ్లీ స్పీకర్ తప్పక అమలు చేయాలని ఆయన కోరారు.

# కాకతీయ కెనాల్ పక్కన పసికందు..

**హుజూరాబాద్ లో అమానవీయ ఘటన..**

జనపదం, కరీంనగర్ : హుజురాబాద్ మండలం తుమ్మలపల్లి సమీపంలోని కాకతీయ కెనాల్ పక్కన పసికందు అరుపులు స్థానికులను ఆందోళనకు గురి చేసింది. అటుగా వెళ్లిన రైతు చొక్కా రెడ్డి భయాందోళనకు గురై గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. స్థానికులు నలుగురైదుగురు కలిసి మూటవిప్పి చూడగా చీమలుపట్టిన మగశిశువును చూసి ఆవేదన చెందారు. సీఐ తిరుమల్ అక్కడికి చేరుకుని హుటాహుటిన హుజురాబాద్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం పసిబాలుడు ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు.

**ఎవరు పడేశారు..?**

ఆడ శిశువును లింగ వివక్షతతోనో, పోషించడం భారంగా భావించో పడేయడం వంటి ఘటనలు జరుగుతుంటాయి. కానీ, మగ శిశువును పడేయడం స్థానికంగా కలకలం సృష్టిస్తుంది. ఏ తల్లి కన్న బిడ్డో తెలియదు కానీ పండంటి బాబును పడేయడానికి చేతులు ఎలా వచ్చాయోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టు చప్పుడు కాకుండా అక్రమ సంబంధంతో పుట్టిన బాబో లేక సక్రమ సంబంధంతో పుట్టి కుటుంబ కలహాలతో పడేయాల్సి వచ్చిందో తెలియదు కానీ మూట కట్టి పడేయడం చూపరుల హృదయాలను ద్రవింపజేసింది.

**ఆరా తీస్తున్న పోలీసులు**

పసికందును కన్న వారి ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. హుజురాబాద్ రూరల్ సీఐ తిరుమల నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ బృందం హుజురాబాద్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఇటీవల డెలివరీ అయిన వారి గురించి ఆరా తీసే పనిలో నిమగ్నమయ్యారు. మూడు రోజులు క్రితం పుట్టిన బాబు అని డాక్టర్లు నిర్ధారించడంతో నాలుగైదు రోజుల నుంచి పురిటినొప్పులతో ఉన్న వారు గ్రామాల్లో ప్రెగ్నెన్సీ లేడీస్ డీటెయిల్స్ కనుక్కుంటున్నారు. అక్రమ సంబంధం వల్ల కలిగిన సంతానం కావడంతోనే మూట కట్టి పడేసి ఉంటారని భావిస్తున్నారు. పసికందును కన్నవారి ఆచూకీ కనుక్కనే పనులో నిమగ్నమై... కెనాల్ పక్కన బాబును పడేసిన గంటల వ్యవధిలోనే గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించిన స్థానికులను అభినందించారు. గతంలో సైతం ఈ ప్రాంతంలో ఇటువంటి సంఘటనలు జరిగాయని పోలీసులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వరద నష్టం రూ.9 వేల కోట్లు

- ఉదారంగా సాయం చేయండి
- వరదలతో అతలాకుతలం అయ్యాం
- మొత్తం 8 రంగాలు అధ్వాన్నమయ్యాయి
- 35 మంది చనిపోయారు
- ప్రాథమిక అంచనా రూ. 5 వేల కోట్లు
- 17,916 మంది నిరాశ్రయులయ్యారు
- కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక



**జనపదం, బ్యూరో :** తెలంగాణకు వరదల వల్ల రూ.9 వేల కోట్లపైనే నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదికలో రాష్ట్రానికి ఉదారంగా సాయం చేయాలని విన్నవించింది. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జన జీవనం అస్తవ్యస్తం అయిందని, ఎనిమిది రంగాలు పూర్తిగా అధ్వానం అయ్యాయని పేర్కొన్నది. వరదల్లో చిక్కుకుని 35 మంది చనిపోగా, సుమారు 17వేల మందికిపైగా నిరాశ్రయులయ్యారన్నారు. వేల ఎకరాల పంట నీటి మునడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లిందని, ముఖ్యంగా పెద్ద సంఖ్య లో రోడ్డు, కల్వర్టులు, బ్రిడ్జిలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, అనేక ఇళ్లు కూలిపోయాయని వాపోయింది.

**క్షేత్ర స్థాయి పర్యటన..**

ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతం అయ్యాయి. ఈ నేపథ్యంలో వరదల వల్ల ఏర్పడిన నష్టాన్ని పరిశీలించడానికి కేంద్ర బృందం బుధవారం రాష్ట్ర పర్యటనకు వచ్చింది. రెండు రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో వరదల వల్ల నష్టపోయిన పలు జిల్లాల్లో క్షేత్ర స్థాయిలో బృందం అధికారులు పర్యటించారు. బాధితులతో నేరుగా ముచ్చటించారు. వరద సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన సాయం, వ్యవహరించిన తీరును కూడా అడిగి తెలుసుకున్నారు. కాగా గురువారం వారి పర్యటన ముగియడంతో వర్షాల కారణంగా వాటిల్లిన నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం నివేదిక అందించింది. బాధితులకు పూర్తి స్థాయిలో సాయం చేయాలని అందులో విన్నవించింది.

**నివేదికలో పొందుపరిచిన అంశాలు**

భారీ వర్షాల వల్ల వచ్చిన వరదల దాటికి సూర్యాపేట, నల్గొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, ఖమ్మం, నాగర్ కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొత్తం ఎనిమిది రంగాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయని పేర్కొంది. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్‌జిల్లాల్లోని పట్టణాల్లో కాలనీలు, బస్తీలు, లోతట్టు ప్రాంతాలు మునిగి ప్రజా జీవనం అస్తవ్యస్తమైంది. మొదటిగా ప్రాథమిక నష్టం రూ.5,438 కోట్లుగా అంచనా వేయగా, అది దాదాపు రెట్టింపైందని పేర్కొన్నంది. ఇప్పటి వరకు భారీ వర్షాలు, వరదలకు 35 మంది చనిపోయారు. 28,869 ఇళ్లు కూలగా, 17,916 మంది నిరాశ్రయులు అయ్యారు. మొత్తం 75,097 పశువులు భారీ వర్షాల వల్ల వచ్చిన వరదలకు కొట్టుకుపోయి చనిపోయాయని నివేదికలో పేర్కొంది.

# నష్టాన్ని కళ్లారా చూశాం..

- వరద నష్టంపై కేంద్రానికి నివేదిక అందజేస్తాం..
- కేంద్ర బృందం ప్రతినిధి కల్నల్ కేపీ సింగ్
- ముగిసిన ఖమ్మం పర్యటన



**జనపదం, ఖమ్మం :** ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర బృందం గురువారం రెండో రోజు ఖమ్మం జిల్లాలో పర్యటించింది. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అడ్వైజర్ కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలో మహేష్ కుమార్, శాంతినాథ్ శివప్ప, ఎస్కె కుష్వాహ, టి.నియాల్ కన్సన్, డాక్టర్ శ్రీ శశివర్ధన్ రెడ్డి కూడిన కేంద్ర బృందం అధికారులు ముగ్గురు చొప్పున రెండు బృందాలుగా జిల్లాలో పర్యటించారు. మొదటి బృందం అధికారులు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి రాజీవ్ గృహకల్ప, ఖమ్మం నగరంలోని కాల్వఒడ్డు బొక్కలగడ్డ, ప్రకాష్ నగర్ మున్నేరు బ్రిడ్జి, మోతీనగర్ ప్రాంతాల్లో, రెండో బృందం అధికారులు ఖమ్మం రూరల్ మండలం దానవాయిగూడెం, తల్లంపాడు- తెల్దారుపల్లి, తనగంపాడు, ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లో తిరుగుతూ మున్నేరు ఉధృతిని, ప్రవాహం ఏ మేరకు వచ్చింది, ప్రవాహం ఎంత సమయం మేర నిలిచింది, నష్ట వివరాలను ఫొటో ఎక్జిబిషన్ ద్వారా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కేంద్ర బృందంలోని అధికారులకు వివరించారు. దెబ్బతిన్న ఇండ్లు, సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన కుటుంబాలను కేంద్ర బృందం కలిసి, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గనులు, భూగర్భ ఖనిజాల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ పర్యటించారు. భారీ వర్షాలు, వరదల విధ్వంసాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు, ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా ఆ రోజున జరిగిన విలయాన్ని కళ్ళకు కట్టినట్లు అర్థం అవుతుందని, జరిగిన నష్టాన్ని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు కేంద్ర బృందానికి నాయకత్వం వహించిన కల్నల్ కేపీ సింగ్ తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిలేష్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, ఆర్డీవోలు జి.గణేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇదో కొత్త డ్రామా..

- బీఆర్ ఎస్, కాంగ్రెస్ దొందూ ఏకీహే...
- రాహుల్ వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే వేషాలు...
- అందుకే ఎమ్మెల్యేల కొత్త నాటకం
- ఐఎన్సీ అంటే ఇటాలియన్ కాంగ్రెస్ పార్టీ
- కేంద్రమంత్రి బండి సంజయ్
- సికింద్రాబాద్ లో బీజేపీ సభ్యత్వ నమోదు



**జనపదం, హైదరాబాద్ సిటీ :** అమెరికా పర్యటనలో భాగంగా భారతదేశ ఎన్నికల వ్యవస్థపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు మన రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త నాటకానికి తెర లేపారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. సంఘవిద్రోహ శక్తులైన ఉగ్రవాద సంస్థలు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను సమర్థించడం వెనుకున్న ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. విదేశాలు వెళ్ళి స్వదేశాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తారా అని మండిపడ్డారు. అమెరికాకు వెళ్ళి భారత్ ఎన్నికల సంఘం మోడీకి అనుకూలంగా ఉండటం వలనే బీజేపీకి ఎక్కువ ఎంపీ సీట్లు వచ్చాయని రాహుల్ మాట్లాడటం ఎంతవరకు కరెక్టు అని నిలదీశారు. ఐఎన్సీ అంటే ఇటాలియన్ కాంగ్రెస్ పార్టీ అని, రాహుల్ గాంధీ దేశాన్ని వదిలి వెళ్ళాలని అన్నారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్ లోని ఉజ్జయిని మహంకాళీ ఆలయంలో ప్రత్యేక పూజలను కేంద్రమంత్రి బండి సంజయ్ నిర్వహించారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి అక్కడ జనరల్ బజార్ లో ప్రజల వద్దకు వెళ్ళి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో తెలంగాణలో సంచలనం సృష్టిస్తామన్నారు. బీజేపీ కార్యకర్తలంతా కష్టపడి పనిచేసి సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో ఇన్నాళ్లు కొనసాగిన పాలన ప్రజా కంఠక పాలన అని కాంగ్రెస్ అంగీకరించినట్లేనా? అని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలను మీరు కూలుస్తారా? మమ్ముల్ని కూల్చమంటారా? అంటూ సీఎం హెచ్చరించడం సిగ్గుచేటన్నారు. అక్రమ నిర్మాణాలని తెలిసి అధికారులు ఎట్లా అనుమతి ఇచ్చారు? వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తాము హైడ్రాకు వ్యతిరేకం కాదని, కానీ పేద, మధ్య తరగతి ఇండ్ల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడమే ప్రజా పాలనా అని నిలదీశారు. ఇచ్చిన హామీలను ఎగొట్టడమే ప్రజా పాలనకు గీటురాయా అని బండి సంజయ్ ప్రశ్నించారు.

# విద్యుత్ సంస్థల నెత్తిన మరో గుదిబండ

- కరంట్ కొనుగోలుకు బిడ్లు వేయకుండా అడ్డుపడ్డ పవర్ ఎక్సెంజీలు..
- ఛత్తీస్ గఢ్ పవర్ గ్రిడ్ తో చేసుకున్న కారిడార్ ఒప్పందంపై వివాదం
- రూ.261 కోట్లు చెల్లించాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఫిర్యాదు
- తెలంగాణ విద్యుత్ బిడ్ల విషయంలో హైకోర్టు స్టే



**జనపదం, బ్యూరో :** గత ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థలకు భారీ షాక్ తగిలినట్లయింది. ఏకంగా రాష్ట్రమంతటా విద్యుత్తు సరఫరా నిలిచిపోయే ప్రమాదం హైకోర్టు జోక్యం చేసుకోవటంతో త్రుటిలో తప్పినట్లయింది. వివరాలు.. విద్యుత్ కొనుగోళ్లు, సరఫరా విషయంలో ఇప్పుడిప్పుడే బాలారిష్టాలు దాటుతున్న రాష్ట్ర ప్రభుత్వం నెత్తిన మరో గుదిబండ పడింది. రాష్ట్ర డిస్కంలు విద్యుత్ కొనుగోలుకు బిడ్లు వేయకుండా గురువారం ఉదయం నుంచి అడ్డుపడ్డ పవర్ఎక్సెంజీలు.. ఛత్తీస్ గడ్ విద్యుత్ కొనుగోళ్లక సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ. 261కోట్లు చెల్లించాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ కు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. ఈ ఫిర్యాదుతో తెలంగాణ డిస్కంలు విద్యుత్ బిడ్లలో పాల్గొనకుండా నేషనల్‌లోడ్ డిస్పాచ్ సెంటర్ అడ్డుకున్నాయి. ఏ గత్యంతరం లేకపోవడంతో రాష్ట్ర సర్కార్ హై కోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు విద్యుత్ బిడ్ల విషయంలో స్టే ఇచ్చింది. దీంతో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించినట్లయింది. ఇదిలావుంటే ఛత్తీస్ గడ్ నుంచి విద్యుత్‌ను తెచ్చుకునేందుకు గత ప్రభుత్వం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ తో విద్యుత్ సరఫరాకు కారిడార్ బుక్ చేసుకున్న విషయం తెలిసింది. అయితే ఇప్పుడా కారిడార్‌ల వివాదం రాష్ట్ర డిస్కంల మెడకు చుట్టుకుంది. మరోవైపు ఛత్తీస్ గడ్ నుంచి విద్యుత్ లభించే అవకాశం లేదని భావించిన గత ప్రభుత్వం ఈ కారిడార్‌ను అర్ధాంతరంగా రద్దు చేసుకున్నది. అప్పట్లో అవసరం లేకున్నా కారిడార్లను ముందుగానే బుక్ చేసుకున్న ప్రభుత్వ నిర్వాకంతో ప్రస్తుతం డిస్కంలపై ఆర్థిక భారం పడుతుంది. వాడినా, వాడుకున్నా పరిహారం కింద రూ. 261 కోట్లు కట్టాలంటూ పీజీసీఐఎల్‌తెలంగాణ డిస్కంలకు నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఈ వివాదంపై కేంద్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ను తెలంగాణ డిస్కంలు ఆశ్రయించాయి. అయితే ప్రస్తుతం ఈ వివాదం సీఈఆర్సీ పరిధిలో ఉండగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో వాదనలు వినిపించింది. దీంతో హైకోర్టు దానిపై స్టే విధించింది.




# విమోచనమా.. ప్రజా పాలనా..?

- అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తారా..?
- కాంగ్రెస్ సర్కార్ ఏం చేయబోతోంది..?

**జనపదం, బ్యూరో :** తెలంగాణలో అరాచక పాలనతో ప్రజల జీవితాలతో చెలగాటం ఆడి, ఎంతోమంది ప్రాణాలను బలిగొన్న రాజాకారులను తరిమికొట్టిన గడ్డ ఇది. ఆనాడు జరిగిన పోరాటంలో ఎంతో మంది అసువులుబాశారు. వారిని స్మరించుకునేందుకు తెలంగాణ విమోచన దినాన్ని జరుపుతున్నారు. అయితే గత పదేళ్లుగా అధికార బీఆర్ఎస్ సర్కారు తెలంగాణ విమోచన ఉత్సవాలకు దూరంగా ఉంది. అయితే బీజేపీ మాత్రం తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తూ వచ్చింది.

**రెండేళ్లుగా..**

తెలంగాణ విమోచన దినాన్ని గత రెండేళ్ల నుంచి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. నిజాం పాలన అదే విధంగా వారి వికృత చేష్టలు వెల్లగడుతూ ప్రత్యేక స్టాళ్లు కూడా ఏర్పాటు చేశారు. వారి పాలన ఏ విధంగా ఉందనేది అద్దం పట్టే విధంగా ఆ ఫొటో ఎగ్జిబిషన్ లో కనిపించేది. అయితే గత పదేళ్ల నుంచి అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఉత్సవాలకు దూరంగా ఉండటంతో బీజేపీ ఆధ్వర్యంలోనే జరిపించారు. అయితే ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవం జరపాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అన్ని జిల్లాలో ఏర్పాట్లు చేయాలని సర్కులర్ జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం, ప్రత్యేకంగా జిల్లాకు ఇంచార్జులుగా మంత్రులను నియమించారు.

**నిర్వహిస్తుందా లేదా...?**

తెలంగాణలో ప్రజా పాలన నడుస్తోంది. మా ప్రభుత్వం అందరితో కలిసి అభివృద్ధి కోసం పాటు పడతాం. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తుందా లేదా అనేది ఇప్పుడు చర్చ జరుగుతుంది. ఇప్పటికే సెప్టెంబర్ 17 ను ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదీ ఆసక్తికరంగా మారింది.

# కౌశిక్ వ్యాఖ్యలు సరికాదు..

- బతకడానికి వచ్చినోళ్లు అనడం తప్పు..
- వాళ్ల ఓట్లుకావాలిగానీ, వాళ్లు వద్దా..?
- చేజారకుంటే సర్కార్ సేఫ్..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్..



**జనపదం, ఢిల్లీ :** ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపుల చట్టంపై కూడా ఆయన స్పందించారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసిన రేవంత్ రాష్ట్ర రాజకీయాలు, మంత్రివర్గ విస్తరణ, వర్షాలు, వరదలు, తదితర అంశాలపై చర్చించారు. మరోవైపు కేసీ వేణుగోపాల్‌తో భేటీ అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలువనున్నారు. రాష్ట్రంలో వర్షాలు, వరద నష్టం వివరాలను హోంమంత్రికి వివరించి కేంద్రం సాయం కోరే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక అమిత్ షాతో భేటీ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి మంత్రివర్గ విస్తరణపై వారితో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై మాట్లాడారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవి ప్రతిపక్షానికే ఇచ్చామని, అసెంబ్లీ చివరిరోజు బీఆర్ఎస్ సభ్యుల సంఖ్యను ప్రకటించారని తెలిపారు. 38 మంది అని ప్రకటించినప్పుడు బీఆర్ఎస్ ఎందుకు అభ్యంతరం చెప్పలేదని ప్రశ్నించారు. 2019 నుంచి అక్బరుద్దీన్ పీఏసీ ఛైర్మన్‌గా ఎలా ఉంటారు? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉంటే ఎంఐఎంకు పీఏసీ చైర్మన్ ఎలా ఇచ్చారు? అని సీఎం ప్రశ్నించారు. బతకడానికి వచ్చినోళ్ల ఓట్లు కావాలి కానీ, వాళ్లకు టికెట్లు ఇవ్వొద్దా? అని అడిగారు. బతకడానికి వచ్చినోళ్లు అంటూ కౌశిక్ చేసిన వ్యాఖ్యలు సరికాదని హితవు పలికారు. కౌశిక్‌రెడ్డి మాటలపై కేసీఆర్ కుటుంబం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపులపై చట్టం కఠినంగా ఉంటే మంచిదేనన్న ముఖ్యమంత్రి కోర్టుల నిర్ణయాలు తమకే మేలు చేస్తాయని పేర్కొన్నారు. తమ ఎమ్మెల్యేలు చేజారకపోతే ప్రభుత్వం బలంగానే ఉంటుందని అన్నారు.

# లైంగికదాడి నిందితుడికి 20 ఏళ్ల జైలు

- ప్రేమ పేరుతో మోసం
- జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధించిన కోర్టు

**జనపదం, ఖానాపూర్ :** ఓ మైనర్ ను ప్రేమ పేరుతో పెండ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన యువకుడికి కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1500 జరిమానా విధించింది. వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్ర కు చెందిన దుర్కే బాలాజీ నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం తర్లపాడు గ్రామంలో భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న శ్రీ సాయి ఇండస్ట్రీస్‌లో సిమెంట్ ఇటుకలను తయారు చేస్తూ, కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇక్కడే మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువకుడు చాంద్ కుమార్ మరవి (20) వీరితో కలిసి అక్కడే కూలీగా పని చేసేవాడు. అయితే చాంద్ కుమార్ లైంగిక వాంఛ తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో బాధితుడి కూతురుకు నేను నిన్ను ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని నమ్మించాడు. మోసపూరిత మాటలు చెప్పి ఆమెను శారీరకంగా లొంగతీసుకున్నాడు. తరువాత నిందితుడు పథకం ప్రకారం బాధితురాలు మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, ఆమెను నిందితుని స్వస్థలమైన మధ్యప్రదేశ్‌కు తీసుకెళ్లి నిర్బంధించి అనేక సార్లు శారీరకంగా వాడుకున్నాడు. ఈ విషయం గురించి బాలిక తండ్రి దుర్కే బాలాజీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసాడు. దీంతో కేసు నమోదు చేసి, నేరస్తుడిని అరెస్టు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్ రెడ్డి 15 మంది సాక్షులను కోర్టులో విచారించారు. బాలికను లైంగికంగా వేధించినట్లు కోర్టులో రుజువు అయింది. నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి కర్ణ కుమార్ చాంద్ కుమార్ మరవికి గురువారం 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.



# ఆర్టీసీ ఉద్యోగులకు పండుగ బోనస్

**జనపదం, హైదరాబాద్:** ఆర్టీసీ జేఏసీ ఒత్తిడికి ఆర్టీసీ యాజమాన్యం దిగొచ్చింది. పండుగ అడ్వాన్స్ చెల్లించడానికి అంగీకరించింది. గతంలో నిలిపివేసిన పండుగ అ డ్వాన్స్‌ను పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించింది. దసరా అడ్వాన్స్‌గా క్లాస్–3 ఉద్యోగులకు 6 వేలు, క్లాస్–4 ఉద్యోగులకు 5,500 ఇవ్వనున్నట్టు పేర్కొంది. 25 వేల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరనుందని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా, కోకన్వీనర్ యాదయ్య, సురేశ్ పేర్కొన్నారు.

# పండు ఫసక్కా..?!

**(మొదటిపేజీ తరువాయి)** సమయంలో ఇక్కడ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భార్యతో కలిసి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును కలిశారు. రేవంత్ తీసుకుంటున్న ఒంటెత్తు పోకడలతో రాష్ట్రంలో పరిస్థితులు గందర గోళంగా మారుతున్నాయని, పెద్ద తలలుగా పరిగణించే వారు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మరీ ముఖ్యంగా హైడ్రాతో రాజకీయ, సినీ, ఇతర రంగాల ప్రముఖుల పునాదులు కదులుతున్నాయని, ఆ విషయంలో సీఎం ఎవరు చెప్పినా వినే దాఖలాలు కనిపించడం లేక తప్పనిసరై బాబుతో చెప్పుకొచ్చినట్టు సమాచారం.



**చాపకింద నీరులా సీఎం వర్సెస్ సీనియర్స్..**

సీఎం రేవంత్ రెడ్డి పైకి ప్రజాస్వామ్యయుతంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం., కేబినెట్ తో చర్చిస్తున్నాం., సహచర మంత్రులతో మాట్లాడుతున్నామని చెప్పుకుంటున్నా., లోలోపల మాత్రం కొన్ని వ్యక్తిగతంగా అమలు చేస్తున్నారని సీనియర్లు ఆరోపిస్తున్నారు. అసలు విషయాలు బయటకు పొక్కకుండా కేవలం కొన్ని లీకులిచ్చి ఆయన సొంత నిర్ణయాలనే అమలు చేసేలా యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని పేర్కొంటున్నారు. దీంతో ఇటు సీనియర్ మంత్రులకు, అటు సీఎం కుమధ్య అగాధం తెలియకుండానే పెరుగుతున్నది. అసలే కాంగ్రెస్ అలాంటి పార్టీలో జూనియర్, సీనియర్ తేడాలు అత్యంత క్లియర్. నిన్నగాక మొన్నొచ్చిన వ్యక్తి ఇప్పుడు లీడర్ షిప్ తో నెత్తికెక్కి నాట్యం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని పలువురు మంత్రులు అనుచరుల వద్ద పేర్కొన్నట్టు సమాచారం.

**చంద్రబాబు ఉత్తమ్ దంపతుల భేటీ.. రేవంత్ పై ఫిర్యాదులు**

ఏపీ సీఎం చంద్రబాబుతో ఉత్తమ్ దంపతుల భేటీ రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఓ వైపు రేవంత్ హస్తినాలో ఉండగా ఆయన కేబినెట్ లోని కీలక నేత అందునా తనకు గురువుగా యావత్ రాజకీయ ప్రముఖులు పేర్కొనే చంద్రబాబుతో భేటీ కావడమే ఇప్పుడు హాట్ టాపిక్. ముమ్మాటికి రేవంత్ అతి తనం, దూకుడుతో పెద్దలను కూడా పట్టించుకోని మొండితనంపైనే వివరించి, పలు ఫిర్యాదులను ఆయన ముందించినట్ట సమాచారం. అదే సమయంలో రేవంత్ కూడా ఉత్తమ్ కదలికలపై నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. ఎన్నటికైనా తనకు థ్రెడ్ ఉండబోయేది ఆయనతో అనే అనుమానంతో ఉన్న సీఎం కనిపెట్టుకుని ఉన్నట్టు సమాచారం. ప్రతి కదలికను తెలుసుకుంటూ అవసరమైన వేళ పావులు కదిపేలా సిద్ధంగా ఉన్నట్టు వినికిడి.

# బాలికపై లైంగికదాడి కేసులో ఉరి శిక్ష

- సంగారెడ్డి జిల్లాలోని పోక్సో కోర్టు సంచలన తీర్పు..
- 56ఏళ్ల బీహార్ వలస కార్మికుడికి ఉరి శిక్ష
- 11నెలలలోపే తీర్పు వెల్లడి..
- రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలంటూ ప్రభుత్వానికి ఆదేశం






**జనపదం, సంగారెడ్డి:** ఐదేళ్ల బాలికపై హత్యాచారం కేసులో సంగారెడ్డి జిల్లాలోని పోక్సో కోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఈ కేసులో ముద్దాయిగా ఉన్న 56 ఏళ్ల బీహార్ వలస కార్మికుడికి ఉరిశిక్ష విధించింది. ఈ మేరకు గురువారం తీర్పుని వెలువరించింది. చిన్నారి తల్లితండ్రులకు ప్రభుత్వం 10 లక్షల రూపాయలను పరిహారంగా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటన జరిగిన 11 నెలలలోపే తీర్పు వచ్చింది. సంగారెడ్డి కోర్టు పరిధిలో ఉరిశిక్ష విధించడం 27 సంవత్సరాల తర్వాత ఇదే మొదటిసారి.

**కేసు వివరాలు ఇలా..**

బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. చైతన్య కంపెనీలో పనిచేసే దంపతుల ఐదేళ్ల కుమార్తెను సెక్యూరిటీ గార్డ్ వద్ద ఉంచి వారు పనికి వెళ్లారు. వీరి రూమ్ పక్క రూంలో ఉండే నేరస్తుడు గఫాఫర్ అలీ అక్టోబర్ 16, 2023 నాడు పనికి వెళ్లకుండా మద్యం సేవించి ఉన్నాడు. సుమారు ఉదయం 11 గంటల సమయంలో సెక్యూరిటీ గార్డ్ వద్ద పాప కనిపించగా పాప తెలుసని చెప్పి తీసుకెళ్లాడు. చిన్నారికి మద్యం కలిపిన కూల్ డ్రింక్ తాగించి పత్తి చేనులోకి తీసుకెళ్లాడు. అత్యాచారం చేసి ఆపై హత్య చేశాడు. బాలిక కోసం సాయంత్రం అంతటా వెతికిన తల్లితండ్రులు..చివరికి చిన్నారి శవాన్ని పత్తి చేనులో గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు పూర్వపరాలను విన్న స్పెషల్ పోక్సో జడ్జి జయంతి.. నిందితునికి మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

**11 నెలలలోనే తీర్పు..**

ఈ ఘటన జరిగిన 11 నెలల కాలంలోనే తుది తీర్పు వెలువడింది. సరైన ఆధారాలు సమర్పించిన పోలీసులు.. నిందితునికి ఉరి శిక్ష పడేలా చేశారు. నిందితుడు గఫ్ఫార్ అలీ బీహార్ రాష్ట్రం జమోయి జిల్లాలోని సికిందర్ తాలుకకు చెందినవాడు. నిందితునికి శిక్షపడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, పీపీలను జిల్లా ఎస్పీ అభినందించారు.




# రెండు రోజులు మందు బంద్..

**ఆదేశాలు జారీ చేసిన పోలీసులు**

**నిమజ్జనం సందర్భంగా నిర్ణయం**

**జనపదం, బ్యూరో:** హైదరాబాద్‌లోని మందుబాబులకు పోలీస్ అధికారులు బ్యాడ్ న్యూస్ వినిపించారు. రెండు రోజుల పాటు వైన్స్, బార్లు మూసేయాలని హైదరాబాద్ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుగుతుండగా.. ఇప్పటికే నగరంలో వినాయక నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. వినాయకున్ని ప్రతిష్టించిన తర్వాత మూడో రోజు నుంచే.. నిమజ్జనాలు చేస్తుంటారు. ఈ క్రమంలో.. ఇప్పటికే నగరంలోని హుస్సేన్ సాగర్‌తో పాటు పలు చెరువులు, కుంటల వద్ద గణేష్ నిమజ్జనాల సందడి నెలకొంది. అయితే.. ప్రధానంగా నగరంలోని బడా గణేషుడైన ఖైరతాబాద్ వినాయకుని నిమజ్జనం మంగళ వారం రోజున నిర్వహించనున్నారు. ఈ క్రమంలో.. నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. కొత్తగా వచ్చిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్.. రంగంలోకి దిగి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో.. నగరంలో రెండు రోజుల పాటు మద్యం షాపులు మూసేయాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 17వ తేదీన ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలతో పాటు కల్లు దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు, మూసేయాలని సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిబంధనలను వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లు తప్పక పాటించాలని.. ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు.

# సీనియార్టీ జాబితా రూపొందించాకే బదిలీలు

**తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల పిటిషన్లపై హైకోర్టు**




**జనపదం, బ్యూరో:** తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను రూపొందించి, 2023 నాటి మార్గదర్శకాల ప్రకారం బదిలీలు చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. బదిలీలకు పాయింట్‌లను లెక్కించే ముందు పాఠశాలలో చేరిన తేదీని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టంచేసింది. సీనియార్టీ జాబితా లేకుండా రూపొందించిన మార్గదర్శకాలను సవాలు చేస్తూ వెంకటరమేశ్ మరో 14 మంది దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీ మార్గదర్శకాలు గతంలో ప్రభుత్వం జారీచేసిన జీవో 81కి విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. పిటిషనర్లు 2012 నోటిఫికేషన్ ఆధారంగా 2013, 2014 సంవత్సరాల్లో నియమితులయ్యారని, అధికారుల పాలనాపరమైన వివాదాల వల్ల కొందరు 16 నెలలు ఆలస్యంగా నియమితులయ్యారని చెప్పారు. సీనియార్టీ జాబితా రూపొందించే ముందు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను వేరుగా చూడరాదని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని గుర్తుచేశారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ విద్యాశాఖ కింద పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ కమిటీ బదిలీ మార్గదర్శకాలను రూపొందించిందని చెప్పారు. ఇవి జీవో 81కి విరుద్ధం కాదని, దానికి అనుగుణంగానే ఉన్నాయని తెలిపారు. పిటిషనర్లు అందరూ పదేండ్లకు పైబడి ఒకేచోట పనిచేస్తున్నారని, అందరూ బదిలీకి అర్హులేనని పేరొన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి ఒకే నోటిఫికేషన్ ఆధారంగా నియమితులైనందున వారు చేరిన తేదీలు, తెలుగు, ఆంగ్ల మాధ్యమాలతో నిమిత్తం లేకుండా సీనియార్టీ జాబితా రూపొందించి, బదిలీ పాయింట్‌లను కేటాయించి బదిలీ ప్రక్రియను చేపట్టాలని ఆదేశిస్తూ పిటిషన్‌లపై విచారణను మూసివేశారు.


## CINEMA NEWS సినిమా పదం



# కాంచన-4

హార్రర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కి.. సూపర్ క్రేజ్ సంపాదించుకున్న ఫ్రాంఛైజీల్లో ఒకటి కాంచన. టాలెంటెడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ రాఘవా లారెన్స్ కాంపౌండ్ నుంచి ఈ ఫ్రాంఛైజీలో ఇప్పటికే మూడు పార్టులు రాగా.. ఇప్పుడు కాంచన-4 కూడా రాబోతుందన్న వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజాగా దీనికి సంబంధించిన వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. కాంచన 4 స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, త్వరలోనే చిత్రీకరణ షురూ కానుందంట. రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో రాబోతున్న కథ చెప్పిన వెంటనే ఇంప్రెస్ అయిన బాలీవుడ్ భామ పూజా హెగ్డే ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించేందుకు ఒప్పుకుందని కోలీవుడ్ సర్కిల్ టాక్. ఈ చిత్రాన్ని గోల్డ్ మైన్ ఫిలిమ్స్ తెరకెక్కించనుంది. ఈ విషయమై నిర్మాత మనీశ్ షా మాట్లాడుతూ.. రాఘవా లారెన్స్ డైరెక్షన్‌తోపాటు నటించనున్నారు. స్క్రిప్ట్ కూడా రెడీ చేశారు. లారెన్స్ ముంబైలో ఉన్నారు. సినిమాకు సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులను ఫైనల్ చేయాల్సి ఉందన్నారు. కాంచన 4 జనవరి లేదా ఫిబ్రవరి 2025లో సెట్స్‌పైకి తీసుకెళ్తామన్నారు.


# దేవరకు యూ/ఏ



**యంగ్‌టైగర్ ఎన్టీఆర్** కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర'. జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో వరుస ప్రమోషన్స్ చేస్తుంది దేవర టీం. ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పనులు పూర్తిచేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సభ్యులు యూ/ఏ (U/A) సర్టిఫికెట్ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమా రన్‌టైమ్ 2 గంటల 57 నిమిషాల 58 సెకన్ల పాటు ఉండనుంది. ఇక మూవీలో విజువల్స్ అద్భుతంగా ఉంటాయని, చివరి 40 నిమిషాలు సినిమాలో హైలైట్ ఉంటుందని సెన్సార్ బోర్డ్ చెప్పినట్లు టాక్.

# మట్కా అప్ డేట్స్..

టాలీవుడ్ హీరో వరుణ్ తేజ్ కాంపౌండ్ నుంచి వస్తున్న తాజా చిత్రం మట్కా. పలాస 1978 ఫేం కరుణకుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో వస్తున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆసక్తికర విషయం తెరపైకి వచ్చింది. చిత్రీకరణ దశలో ఉన్న మట్కా తుదిదశకు వచ్చేసింది. మట్కా ఫైనల్ షెడ్యూల్ కొన సాగుతుంది. రామోజీఫిలిం సిటీలో పలు కీలక సన్నివేశాలను షూట్ చేస్తున్నారు. ఎక్జయిటింగ్ అప్‌డేట్స్ వచ్చేస్తున్నాయి.. అంటూ మేకర్స్ తాజా వార్తను అందరితో షేర్ చేసుకున్నారు. మట్కా టైటిల్ టీజర్ సినిమాపై అంచనాలు పెంచుతూ నెట్టింట సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. మట్కాలో వరుణ్ తేజ్ కథానుగుణంగా నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించబోతున్నాడట. ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు.



# హేమ డ్రగ్స్ తీసుకుంది..

**బెంగళూరు రేవ్ పార్టీ** కేసులో పోలీసులు తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేశారు. టాలీవుడ్ నటి హేమ డ్రగ్స్ తీసుకున్నట్టు నివేదికలో పేర్కొన్న పోలీసులు ఎండీఎంఏ మెడికల్ రిపోర్ట్‌ను కూడా జత చేశారు. ఈ కేసులో నటి హేమతోపాటు 88 మంది డ్రగ్స్ తీసుకున్నారని వివరించారు. పోలీసులు చార్జ్‌షీట్‌లో రేవ్ పార్టీ నిర్వాహకులుగా 9 మందిని పేర్కొన్నారు. రేవ్ పార్టీ కేసులో హేమ ఇప్పటికే బెంగళూరు పరప్పణ అగ్రహార జైలులో 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని తెలిసిందే. అనంతరం బెంగళూరు రూరల్ ఎన్డీపీఎస్ స్పెషల్ కోర్టు ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇక ఇప్పటికే డ్రగ్స్ కేసులో పట్టుబడటంతో నటి హేమను సస్పెండ్ చేస్తూ మా (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) కమిటీ నిర్ణయం తీసుకుంది. అయితే ఆగస్టులో హేమపై వేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేసింది.

**నిరూపిస్తే దేనికైనా రెడీ..**

పోలీసుల చార్జిషీటు నేపథ్యంలో టాలీవుడ్ నటి హేమ మాట్లాడుతూ.. చార్జ్‌షీట్‌లో తన పేరున్నట్టు తెలిసింది. తాను డ్రగ్స్ తీసుకోలేదు. నేను అసలు శాంపిల్స్ ఇవ్వలేదు. నేను డ్రగ్స్ తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని చాలెంజ్ విసిరింది. ఓ వైపు హేమ డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసులు పేర్కొనడం.. మరోవైపు హేమ మాత్రం డ్రగ్స్ తీసుకోలేదంటూ చాలెంజ్ చేయడంతో.. ఈ వ్యవహారం ఎటువైపు వెళ్తుందనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.



Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com